క్లుప్తంగా

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి



పోస్టల్ సేవలపై అవగాహన

ఎలిగేడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పోస్టల్‌శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు పెద్దపల్లి సీనియర్ మేనేజర్ కొట్టె శ్రీనివాస్, సర్పంచ్ గొల్లె కావేరి అన్నారు. మంగళవారం ఎలిగేడు మండలం ధూళికట్టలో ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో 18 ఏళ్ల నుంచి 65 ఏళ్లలోపు వారికి ఇన్సూరెన్స్ చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. టాటాలో రూ.399, బజాజ్‌లో రూ.396, నివభూపలో రూ.556 చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకుంటే రూ.10లక్షల ఇన్సూరెన్స్ ఉంటుందని, నివభూపలో రూ.750 చెల్లిస్తే రూ.15లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్టుమాస్టర్ కమల, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న అల్లెంకి శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీకి చెందిన విద్యార్థులు జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ మేకింగ్, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీల్లో కూనపల్లవి ప్రథమ బహుమతి, జక్కుల హర్షిత ద్వితీయ బహుమతి పొందారు. డిబేట్ గ్రూప్ డిస్కషన్‌లో బొడ్డుపల్లి శాలిని ప్రథమ, మేకల అక్షయ ద్వితీయ బహుమతి అందుకున్నారు. విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

8న మండల సర్వసభ్య సమావేశం

పాలకుర్తి: మండల సర్వసభ్య సమావేశం 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే ఈ సర్వసభ్య సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల మండల, గ్రామస్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

నేడు అయ్యప్ప ఆలయంలో అభిషేకం



అయ్యప్పస్వామి ఆలయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 5 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయన అర్చకులు కర్నె అశోక్‌శర్మ తెలిపారు. కార్తీక మాసం ఉత్తర నక్షత్రం పురస్కరించుకొని 21 రకాల ప్రత్యేక అభిషేకాలు, 18 కేజీల ఆవు నెయ్యితో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 7 గంటలకు ఆలయంలో హరిహర సుతునికి బస్మాభిషేకం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఘనంగా అయ్యప్పస్వామి మాలధారణ



మాలధారణ చేస్తున్న గురుస్వామి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని హరిహర దేవాలయం ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మాలధారణ నిర్వహించారు. ఆలయ పూజారి, గురుస్వామి బ్రహ్మశ్రీ వామనశర్మ చేతుల మీదుగా అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి అయ్యప్ప మాల ధరించారు. గురుస్వాములు నందం నాగవర్దన్ రావు, చిప్ప కృష్ణప్రసాద్, మోహిత్, హేమంత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీ.. సమస్యల లోగిలి

- రోడ్లపైన నిలుస్తున్న మురుగు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అమృత్ నిధులతో నిర్మించిన పార్కు ముళ్లపొదలకు నిలయం
- 15 ఏళ్లుగా సమస్యలతో సావాసం



నిరుపయోగంగా మారిన పార్కు



ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగు నీరు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌లోని రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. అత్యంత ఎక్కువ మంది పేదలు నివసించే ఈ ప్రాంతంలో సమస్యలు కూడా అదే క్రమంలో పెరుగుతున్నాయి. వర్షం కురిస్తే చాలు కాలనీకి వెళ్లేందుకు సరైన మార్గం ఉండదు. రోడ్లన్నీ బురదమయం అవుతయి. నివాస గృహాల మధ్య అంతర్గత రోడ్లు లేవు. రోడ్డుపక్కన సైడ్ డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. ఇందిరమ్మ కాలనీలోని ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు.

దృష్టిసారించని అధికారులు, పాలకులు

పేదల నివాస గృహాల కోసం అప్పటి ప్రభుత్వం 2008లో మేడిపల్లి శివారులో భూమిని కేటాయించి 6,365 మందికి స్థలాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. కొంతమంది లబ్ధిదారులకు సైతం మంజూరు చేశారు. ఈ క్రమంలో వారి కుటుంబ నేపథ్యం మేరకు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు మూడో డివిజన్‌లోని ఇందిరమ్మకాలనీ సమస్యలకు నిలయంగా మారింది. ప్రజల మౌళిక వసతుల కల్పనపై అధికారులు, పాలకులు దృష్టిసారించక పోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ నిర్మించకపోవడంతో రోడ్డుపైనే మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు నిలిచి దోమలు పెరిగిపోతున్నాయి. దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నామని వారు ఆందోళన చెందుతున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం..

ఇందిరమ్మకాలనీలోని అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయి. మెయిన్ రోడ్డు కాస్త ఉన్నప్పటికీ ఇళ్ల మధ్య రోడ్డు లేకపోవడం, పక్కన కాలువలను నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్డు మధ్యలోకి వచ్చి నిలుస్తోంది.

ముళ్ల పొదలకు నిలయంగా పార్కు

రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇందిరమ్మకాలనీ ఫేస్-2లో అమృత్ పథకం 2017-20 నిధులతో నిర్మించిన పార్కు ఉపయోగంలో లేకపోవడంతో ముళ్ల పొదలకు నిలయంగా మారింది. పార్కులో పెంచే మొక్కలు ఎండిపోయాయి. అక్కరకు రాని మొక్కలు పెరిగిపోతున్నాయి. పచ్చగా ఉండాల్సిన పార్కులు మొక్కలు లేకపోవడంతో చిన్నారులకు ఆటస్థలంగా మారింది.

రోడ్లు నిర్మించండి



ఇందిరమ్మకాలనీలో సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో కాలనీకి రావడానికి చాలా కష్టంగా ఉంది. రోడ్లు బాగా లేకపోవడంతో గుంతలో పడే పరిస్థితులు ఉన్నాయి. వీధిలైట్లు కూడా లేవు. – లత, ఇందిరమ్మకాలనీ

దుర్వాసన వస్తోంది



ఇందిరమ్మకాలనీలో నిర్మించిన పార్కు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ముళ్లపొదలు ఎక్కువగా ఉన్నాయి. సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా మట్టితో నిండి ఉంది. రోడ్డుపక్కన కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దుర్వాసన వస్తోంది. – దుర్గాప్రసాద్, ఇందిరమ్మకాలనీ

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తా ఆటో డ్రైవర్లు అండ్ ఓనర్స్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. 30ఏళ్ల నుంచి ఆటో డ్రైవర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గత పాలకులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. మాజీ సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ఆటో డ్రైవర్లకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రకటించిన ఆటోవాలా స్కీం అందరికీ వర్తింపజేయాలన్నారని గుర్తు చేశారు. కాలనీ, గోదావరిఖని, పెద్దపల్లి ఏరియాల్లో ఆటోలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని ఆటోల పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ చౌరస్తా ఆటో డ్రైవర్లు అండ్ ఓనర్స్ నాయకులు కొదురుపాక కుమార్, సెక్రటరీ చిన్న సాయిలు, కోశాధికారి నెల్లెట్ల మల్లేశ్, రవీందర్‌రెడ్డి, గోపి, సారంగపాణి, గోపికృష్ణ, శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

- ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు
- ఒక్క ప్రజాప్రతినిధి కూడా హాజరు కాని వైనం



అంతర్గాం మండల పరిషత్ కార్యాలయం

రామగుండం: అంతర్గాం మండల సర్వసభ్య సమావేశానికి కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో యాదగిరినాయక్ తెలిపారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసే సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు తమ పరిధిలోని సమస్యలను వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను సంబంధిత శాఖ అధికారులు స్పందించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలి. సభ పూర్తిగా మొక్కుబడిగా సాగుతుండడంతో పాటు ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోవడంతో సర్వసభ్య సమావేశానికి ప్రాధాన్యం లేకుండా పోయింది. ఫలితంగా మంగళవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి మండల పరిధిలోని 14 మంది సర్పంచులు, ఐదుగురు ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు గైర్హాజరుకావడం దీనికి నిదర్శనం. కాగా సమావేశం నిర్వహణకు కోరం లేకపోవడంతో సమావేశాన్ని మరో తేదీకి వాయిదా వేశారు. కాగా గత సెప్టెంబర్ 6న జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి మూడు నెలల ముందు జరిగిన మరో సమావేశంలో లేవనెత్తిన సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోకపోగా వాటినే ప్రతీ సమావేశంలో పేర్కొనడం ప్రజాప్రతినిధులకు రుచించడం లేదు. ఎస్సారెస్పీ కాలువలు శిథిలావస్థకు చేరడంతో పాటు పలు చోట్ల గండి పడిన ప్రాంతాలను పునరుద్ధరించి సాగునీటి సరఫరాను మెరుగుపరచాలని పలుమార్లు సమావేశాల్లో ప్రజాప్రతినిధులు సభాదృష్టికి తీసుకెళ్లినప్పటికీ నేటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుతం యాసంగి సీజన్ ఆరంభం కానుండడంతో సాగునీటి సరఫరాపై అధికారులు దృష్టిసారించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతల్లో మిచాంగ్ తుపాన్ గుబులు

- ఇంకా పూర్తికాని ధాన్యం కొనుగోళ్లు



సుల్తానాబాద్: సుగ్లాంపల్లిలో ధాన్యంపై కవర్లు కప్పిన రైతులు

పాలకుర్తి: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని గ్రామాల రైతుల్లో ఆందోళన నెలకొంది. పాలకుర్తి మండల పరిధిలోని గ్రామాల్లో ఇంకా వరికోతలు కొనసాగుతున్నాయి. కోతలు పూర్తి చేసిన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోశారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో పాటు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కురిసింది. దీంతో కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు వాటిని కుప్పలుగా పోసి ధాన్యం తడవకుండా కవర్లు కప్పి ఉంచినప్పటికీ భారీ వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోతుందని రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న అకాల వర్షాల దాటికి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదముందని ఆవేదన చెందుతున్నారు. వర్షాల కారణంగా కేంద్రాల్లో ధాన్యం ఆరబోసే పరిస్థితులు లేవని, ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు పత్తి రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. వర్షం కారణంగా పత్తిబుగ్గలు తడిసి నల్లబారిపోయే ప్రమాదముందని రైతులు దిగులు చెందుతున్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తుపాను ప్రభావంతో మంగళవారం స్వల్ప వర్షం కురిసింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన వడ్లు తడవకుండా పరదాలు కప్పి ఉంచారు. వర్షం ఎక్కువ పడుతుందోమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు అప్రమత్తం

సుల్తానాబాద్: పట్టణంలోని పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి దెబ్బతినకుండా ఉండేందుకు రైతులు టార్పాలిన్లు కప్పారు. దీంతో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని అధికారులు చెప్తున్నారు.

అంతర్గాం మండలంలో..

రామగుండం: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రెండు రోజుల క్రితం ధాన్యం కోసి ఆరబెట్టుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, ముర్మూర్ రైతులు తమ ధాన్యాన్ని వీధిలోని అంతర్గత రహదారులపై ఆరబెట్టుకొన్నారు. కాగా మబ్బులు, చిరుజల్లులతో రైతులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ధాన్యం కుప్పగా పోసి టార్పాలిన్లు కప్పారు.



రామగుండం: ధాన్యంపై టార్పాలిన్ కప్పిన రైతులు



జూలపల్లిలో వర్షం

శిథిలావస్థలో ఎస్సారెస్పీ కార్యాలయాలు



ఓదెల: ఓదెలలో శిథిలావస్థలోకి చేరుకున్న ఎస్సారెస్పీ కార్యాలయాలు విషపురుగులకు కేరాఫ్‌గా మారాయి. చాలా ఏళ్లుగా నిరుపయోగంగా మారిన ఎస్సారెస్పీ కార్యాలయాలను వదిలేయడంతో విషపురుగులు, పాములకు నిలయంగా మారింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు బెంబేలెత్తుతున్నారు. శిథిలావస్థకు చేరిన కార్యాలయాలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు, మండల ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం పక్కా భవనాలకు నిధులు మంజూరు చేసి నూతనంగా నిర్మించాలన్నారు.

మూగబోయిన పోలీస్‌స్టేషన్ ఫోన్

సుల్తానాబాద్‌రూరల్: ఆపదలో, అత్యవసరం పరిస్థితిలో ప్రతి ఒక్కరూ పోలీసులకే ఫోన్ చేసి రక్షించాలని కోరుతారు. కానీ ఆ పోలీస్‌స్టేషన్ ఫోన్ మూగబోతే ఏంటి పరిస్థితి అని సంబంధిత బాధితులు ఆవేదన చెందుతున్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టణంతో పాటు 27 గ్రామ పంచాయతీలు, దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల వరకు రాజీవ్ రహదారి ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి సుల్తానాబాద్‌లో నెలకొంది. కాగా అత్యవసరంగా, ఆపద సమయంలో ఫోన్ చేయాలంటే పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన ఫోన్ నంబర్ పనిచేయదు. అలాగే స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు చేసినా ఫోన్ కలవని పరిస్థితి సుల్తానాబాద్‌లో నెలకొంది. 24గంటలు ప్రజా సేవకే పని చేస్తున్నామని పోలీసులు అంటున్నా నెట్‌వర్క్ లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



చరిత్రకు నిదర్శనం ఈ గడీలు

సుల్తానాబాద్‌రూరల్: నైజాం కాలంలో పాలన సౌలభ్యం కోసం దాదాపు 200 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ గడీలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. నాటి నైజాం కాలంలో నిర్మించిన గడీలు సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, గట్టెపల్లిలో నేటికీ చరిత్రకు అద్దం పడుతున్నాయి.



అడుగేస్తే.. అంతే మరీ

ముత్తారం: చిరుజల్లులు కురిస్తే చాలు అడుగేస్తే.. మడుగే అన్న చందంగా ఉంది ఉంది పైచిత్రంలో కనిపిస్తున్న దారి. ఇది ముత్తారంలోని ఐకేపీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన దారి దుస్థితి. కార్యాలయానికి వెళ్లే స్వశక్తి మహిళలు, అధికారులు బురదలో అవస్థలు పడుతూ వెళ్తున్నారు. త్వరగా రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.

మిచాంగ్ ఎఫెక్ట్



సుల్తానాబాద్: మిచాంగ్ తుపాన్ కారణంగా చలి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు రోడ్డుపైకి వచ్చేందుకు ఇబ్బంది పడ్డారు. మంగళవారం పట్టణంలోని రహదారిపై చిరుజల్లులు కురవడంతో పాటు చలి తీవ్రత అధికంగా ఉంది. ఉద్యోగస్తులు మినహా మిగతా ప్రజలు బయటకు రాలేదు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాం అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన ఆయా తుమ్మడ సరస్వతి మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. సీడీపీవో గండ్ల స్వరూపరాణితో పాటు మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన టీచర్లు, ఆయాలు మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ మేరకు మృతురాలి కుటుంబసభ్యులకు రూ.10వేల నగదు ఆర్థికసాయంగా అందజేశారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఇందిరమ్మకాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. పార్కులో చిన్నారులు ఆడుకోవడానికి ఇదే దారిగుండా వస్తారు. సంబంధిత అధికారులు కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.